# పేరంటం

ఈ విషయంలో తప్పు మా చెల్లెలుదనే చెప్పాలి. ఆమాటంటే పెళ్ళాన్ని వెనకేసుకొచ్చా డంటారు. అసలే రాకరాక మొట్టమొదటిసారి పట్నం వచ్చిన మా రుక్మిణి ఎన్నాళ్ళనుంచో అణచుకున్న కోరికను మా ఆవిడదగ్గిర చల్లగా బయటపెట్టింది.

"ఏమండీ, మీ చెల్లెలు సినిమాషూటింగు చూడా లంటున్న దే! పాపం, ఎట్లా?" అన్నది మా ఆవిడ. తాను మూడేళ్లనుంచీ ఉంటున్నా ఇటువంటి కోరిక కోరలేదు అది అడిగినపద్ధతి చూసి దానికూడా కోరిక పుట్టిందేమో అనుకున్నా.

"అది మనచేతిలో ఉన్న పని కాదే?" అన్నా.

"వీలుంటే చూడండి, పాపం," అన్నది.

"అన్నట్టు నీ స్నేహితురాలు శ్యామల ఉన్నదిగా? తీసుకుపోయి షూటింగు చూపించు," అన్నా.

"ఆ శ్యామలను నేనేమీ అడగను. అది డెక్కడ ఇప్పుడు!" అన్నది మా ఆవిడ.

ఈ శ్యామల అనే సినిమాతార రెండేళ్ల క్రితం మా ఇంటిసరసనే ఉండేది. మా ఆవిడతో చాలా స్నేహంగా కూడా ఉండేది. అయితే, మా ఆవిడ అన్నట్టు, ఇప్పు డావిడకు కొత్త నాలుగు చిత్రాల్లో బుకింగు దొరికి కొత్త ఐశ్వర్యం పట్టింది. ఇప్పటికీ సంవత్సరాని కోసారి ఏకొడుకు పుట్టినరోజుకో పిలవటానికి ఆవిడగారు 15 వేల రూపాయలకారెక్కి మా ఇంటికి వస్తూఉంటుంది. కాని ఇప్పుడు మా ఆవిడ ఆవిణ్ణిగురించి నాతో ఆసక్తిగా ఏమీ చెప్పదు.

రుక్మిణి ఒకనాడు నేను వింటుండగానే, "వచ్చి వారమయింది. నే వెళ్లేలోపల పడనే పడదుగామాలు?" అని తనలో తాను అనుకుంటున్నట్టుగా అన్నది.

మా ఆవిణ్ణి చాటుగా పిలిచి, "ఏమి ఉంటుందే? షూటింగు చూసేతీరా లంటుందా ఏమిటి?" అన్నా.

"షూటింగుమాట దేవు డెరుగు. ఆ శ్యామల నన్ను ఒకసారి చూస్తా నంటుందండీ, ఎట్లా!" అన్నది మా ఆవిడ.

"ఏం? తీసుకుపో," అన్నా.

"ఉట్టి పుణ్యాని కెట్లా వెళ్లమండీ? ఇంట్లో ఉంటుందో ఉండదో? ఉండకపోతే రెండు బస్సులు మారి ఈదురో మంటూ రావాలి. దగ్గిరా దాపా? ఓ వేళ ఉంటే ఏదైనా పిల్లాడికన్నా పట్టుకుపోవాలా, వద్దా?"

అయిదురూపాయలు చేతిలో పెట్టి, "నీకు పుణ్యం ఉంటుంది. దానికా శ్యామల మొహం కాస్త చూపించేస్తూ!" అన్నా.

రుక్మిణిఅదృష్టం బాగానే పండింది. ఇది జరిగిన రెండో నాడో మూడోనాడో శ్యామలే వచ్చింది మా ఇంటికి. పిల్లాడి పుట్టెంట్రుకలు తీయిస్తున్నదిట. ఇందుకే

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

మా శ్యామల మురిసిపోతుండగా మరో గంటకు మరో సినిమాతారకూడా మా ఇంటి కొచ్చింది—ఆవిడ కూతురి పుట్టినరోజుట.

ఈ రెండో తార పేరు మాణిక్యం. ఈవిడ పెద్దతార కాదు. అందుకనే పాతకారెక్కి వచ్చింది. ఎప్పుడో శ్యామలఇంట్లోనే మా ఆవిడతో స్నేహం చేసుకుందిట.

ఇద్దరు సినిమా మొహాలవాళ్లు మా ఆవిణ్ణి ఎప్పుడైతే పిలిచారో మా ఆవిడమీద రుక్మిణికి అంతులేని అభిమానం ఏర్పడింది. సాయంత్రం పేరంటానికి బయలుదేరేదాకా రుక్మిణి ఉత్సాహంగా ఉండటమే కాక మా ఆవిణ్ణి పంచప్రాణాలుగా చూసుకుంటూ ఒక్క క్షణం విడిచిపెట్టలేదు.

ఆ పేరంటం ఏమయిందో తరవాత నాకు తెలిసింది.

ఉన్నంతలో చెరో మంచి చీరా కట్టుకుని ఇద్దరూ శ్యామల ఇంటికి బయలుదేరారు. అక్కడికి చేరేటప్పటికి ఇంటిబయట అంతులేని కార్లూ, అట్టహాసమూ ఉన్నది. పెద్ద సినిమాతారలూ, సినిమా ప్రొడ్యూసర్లూ మగతారలూ, పెద్దలూ చేరారు. అందరూ పెద్దగా మాట్లాడుతూ, అల్లరిగా నవ్వుతున్నారు. మా ఆవిణ్ణిగాని, రుక్మిణినిగాని చూసినవారు లేరు. శ్యామల పెద్ద పెద్ద వాళ్లతో తప్ప మాట్లాడటం లేదు.

రుక్మిణి ప్రేరణమీద ఇద్దరూ వెళ్లి శ్యామలకు సాధ్యమైనంత దగ్గిరగా నిలబడ్డా ప్రయోజనం లేకపోయింది.

"ఏం పేరంట మిది, నా సొత్తిపేరంటం? పోదాం పదనమ్మా, వొదినా," అన్నది రుక్మిణి.

ఇద్దరూ బయలుదేరి వీథిలోకి అడుగు పెట్టబోతుండగా ఎవరో వెనకనుంచి వచ్చి చెరొకపొట్లమూ, ఇచ్చి, "చెప్పకుండా వెళ్లుతుండా రేం?" అన్నది.

అక్కణ్ణుంచి బయలుదేరి మాణిక్యం ఇంటికి పోయినారు. మాణిక్యం వాళ్లని చాలా ఆదరించింది. తన దగ్గిరే కూచోబెట్టి గంటసేపు సినిమాసంగతులూ అవీ చెప్పింది. రుక్మిణికి మర్నాడు షూటింగు కూడా చూపిస్తా నన్నది. రుక్మిణికి ఆగంటసేపూ సినిమాలో వేషం వేస్తున్నంత ఆనందంగా గడిచింది.

....ఆ రాత్రే మా రుక్మిణి మొగుడు వచ్చాడు. వాడూ నేనూ కలిసే ఇంటి కెళ్లాం. మేం చేరేసమయానికే మా వాళ్లూ ఇంటికి చేరారు.

ఎక్కడికి వెళ్ళారని నా భార్యను నే నడిగేసమయంలోనే వాడూ వాడి భార్య నడిగాడు.

"మాణిక్యంఇంటినుంచి వస్తున్నాం." అన్నది నా భార్య."

"ఏమి టనుకున్నారు? మేం శ్యామల ఇంటికి పేరంటం వెళ్లివస్తున్నాం! ఎన్ని కార్లూ! ఎంత గొప్ప సినిమాతారలూ! ఎంతెంత ఖరీదైన చీరెలూ! ఏమేమి..."

మా బావమరిది పెళ్లాం చెప్పేకబుర్లు వింటూ నోరు తెరుచుకుని అట్లాగే నిలబడి పోయినాడు......